సాక్షి నిర్మల్

సోమవారం, 22, మే, 2023



రైతు నెత్తిన 'విత్తన' భారం

పత్తి విత్తనాలకు ఒక్కో కాటన్ సీడ్ ప్యాకెట్‌పై రూ.43 చొప్పున రేటు పెరిగింది. రూ.810 ఉన్న ప్యాకెట్ ధర ప్రస్తుతం పెరిగిన ధరతో రూ.853కు చేరింది. 8లో▸



బాసరలో భక్తుల రద్దీ 8లో▸

బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేయించారు.

గరిష్టం/కనిష్టం

41.8 /28.7

వాతావరణం

ఎండ తీవ్రత కొనసాగుతుంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. మధ్యాహ్నం వేడి అధికంగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఏలేటి ఇంటికి బండి.. ఈటల



మహేశ్వర్‌రెడ్డి నివాసంలో బండి సంజయ్

నిర్మల్‌చైన్‌గేట్: ఆదిలాబాద్‌లో ఎంపీ సోయం బాపురావు కుమారుని వివాహ వేడుకకు బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆదివారం హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో నిర్మల్‌లోని మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఇంటికి వెళ్లి తేనీటి విందు స్వీకరించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండూ కుమ్మక్కయ్యాయన్నారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు హైదరాబాద్ నుంచి నిధులు వెళ్లాయన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనన్నారు.

శారీరక దృఢత్వానికి కరాటే తప్పనిసరి



శిబిరంలో మాట్లాడుతున్న ధర్మరాజ్

ఖానాపూర్: విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు కరాటే నేర్చుకోవడం తప్పనిసరని జపాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క ధర్మరాజ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కొనసాగుతున్న వేసవి క్రీడా శిబిరాన్ని ఆదివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం కరాటే దోహదపడుతుందన్నారు. రోగనిరోధక శక్తి పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రాజేందర్, శ్రీకాంత్, భూషణ్, క్రాంతి, ఇమ్రాన్, రవీందర్‌గౌడ్, అజీమ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అడెల్లి'లో భక్తుల సందడి



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సారంగాపూర్(నిర్మల్): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన ప్రవేశం కల్పించారు.

శంకర్‌దాదా.. ఎంబీబీఎస్‌లు!

బైంసా పట్టణంలోని గోకుల్‌నగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిని ఇటీవల వైద్యాధికారులు సీజ్ చేశారు. సదరు ఆస్పత్రిలో చర్మవ్యాధుల నిపుణుడిగా పేరున్న ఓ వైద్యుడి పేరుతో ఆస్పత్రి నెలకొల్పి ఎలాంటి అర్హత లేని వ్యక్తి ఆయన పేరిట వైద్యం అందిస్తున్నాడన్న ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ఆస్పత్రిని తనిఖీ చేసి సీజ్ చేశారు.

బైంసా పట్టణంలోనే ఓ దంత వైద్యశాలలో ఇదివరకు పనిచేసిన వైద్యురాలి స్థానంలో ప్రస్తుతం మరో వైద్యురాలు చికిత్స అందిస్తోంది. కొన్నిరోజుల పాటు డాక్టర్ పేరు కూడా మార్చకుండా ఆస్పత్రి కొనసాగించింది. కొందరు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పేరు మార్పు చేసింది. కాగా సదరు వైద్యురాలు ఇక్కడ ప్రాక్టీస్ చేయాలంటే జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో తన ధ్రువపత్రాలు అందించాల్సి ఉంటుంది. కానీ వైద్యాధికారు ల దృష్టికి తీసుకెళ్లకుండానే ఆస్పత్రి కొనసాగిస్తున్నట్లు తెలిసింది.





బైంసాలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆస్పత్రిని సీజ్ చేస్తున్న వైద్యాధికారులు(ఫైల్)

- పేరొకరిది.. ట్రీట్‌మెంట్ చేసేది మరొకరు..
- జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రుల నిర్వహణ
- అర్హత లేకున్నా రోగుల ప్రాణాలతో చెలగాటం
- పట్టించుకోని అధికారులు

బైంసాటౌన్(ముధోల్): దుకాణాలు పెట్టినట్లుగా ఆస్పత్రులు ఏర్పాటు చేసి సంబంధం లేని వ్యాధులకు చికిత్స అందిస్తుండడం కలవరపెడుతోంది. కొందరు పీఎంపీలు, ఆర్‌ఎంపీలు స్థాయికి మించి చికిత్స అందిస్తున్న దాఖలాలున్నాయి. అర్హత లేని వైద్యులతో, అనుభవం లేని సిబ్బందితో రోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వైద్యులు లేకున్నా మల్టీస్పెషాలిటీ పేరిట బోర్డులు ఏర్పాటు చేసి విజిటింగ్ డాక్టర్లను రప్పించి రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో సదరు విజిటింగ్ వైద్యులు రాకపోతే తామే సంబంధిత వ్యాధులకు చికిత్స అందిస్తున్నట్లు ఇటీవలి ఘటనతో నిరూపితమైందని చెప్పవచ్చు. ఇలా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

వైద్యం పేరిట వ్యాపారం...

జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం పేరిట వ్యాపారం కొనసాగుతోంది. మల్టీస్పెషాలిటీల పేరిట ఆస్పత్రులు ఏర్పాటు చేసి వైద్యులు లేకున్నా విజిటింగ్ డాక్టర్లను రప్పించి రోగులను మభ్యపెడుతున్నారు. వైద్యార్హతలు లేకున్నా ప్రాథమిక చికిత్సలతో పాటు శస్త్ర చికిత్సలు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు. ఆస్పత్రులకు అనుబంధంగా మెడికల్ దుకాణాలు ఏర్పాటు చేసి, అవసరానికి మించి మందులు రాస్తూ రోగుల జేబులు గుల్ల చేస్తున్నారు. అవసరమున్నా.. లేకున్నా.. వైద్యపరీక్షల పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారు.

పర్యవేక్షణ కరువు...

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహణపై వైద్యాధికారుల పర్యవేక్షణ కొరవడింది. నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రులు నెలకొల్పి, వైద్యార్హతలు లేకుండా వైద్యం అందిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇటీవల బైంసాలో చర్మవ్యాధుల నిపుణుడిగా చెలామణి అవుతూ వైద్యమందించడంతో రోగికి వైద్యం వికటించింది. దీంతో అనుమానం వచ్చిన సదరు బాధితుడు జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేయగా వారు నామమాత్రంగా చర్యలు తీసుకోవడంతో రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో జిల్లా అధికారులు హుటాహుటిన వచ్చి ఆస్పత్రిని సీజ్ చేయడం వైద్యాధికారుల తీరుకు అద్దం పడుతోందని చెప్పవచ్చు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ ఆస్పత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వైద్యుడి విద్యార్హత ధ్రువపత్రాలు ఆస్పత్రిలో ప్రదర్శించాలి. విజిటింగ్ డాక్టర్ల అర్హత ధ్రువపత్రాలు సైతం ఆస్పత్రుల్లో ప్రదర్శించడంతో పాటు జిల్లా వైద్యాధికారికి సమర్పించాలి. నిబంధనలు పాటించని ఆస్పత్రులపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– ధన్‌రాజ్, డీఎంహెచ్‌వో, నిర్మల్

ఇష్టంగా తినేలా..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యం అన్నం
- జూన్ నుంచి అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు
- జిల్లాలో 74,453 మంది లబ్ధిదారులకు ప్రయోజనం



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: మాతాశిశువుల సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని అధిగమించే దిశగా అనేక చర్యలు చేపడుతోంది. ఇందుకోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలు కలిగిన ఆహారం, పాలు, గుడ్లు, కూరగాయలు, పప్పు, అన్నంతో పాటు చిన్నారులకు అదనంగా బాలామృతం అందిస్తోంది. ఇకనుంచి మరిన్ని మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సన్నబియ్యం భోజనం అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. జూన్ నుంచే అమలు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. సర్కార్ నిర్ణయంతో జిల్లాలో 74,453 మంది చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రయోజనం కలుగనుంది.

పెరుగనున్న హాజరుశాతం

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు కోడిగుడ్లు, పాలు, బాలామృతం, పప్పులు తదితర పౌష్టికాహారంతో పాటు నిత్యం దొడ్డు బియ్యంతో భోజనం తయారు చేస్తున్నారు. కానీ దొడ్డు బియ్యం భోజనాన్ని లబ్ధిదారులు తీసుకోవడం లేదని నిర్వాహకులు పేర్కొంటున్నారు. వసతి గృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం అందించి అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రం దొడ్డుబియ్యం సరఫరా చేస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. దీంతో ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో జూన్ నుంచి మరింత ఇష్టంగా భోజనం చేసేందుకు లబ్ధిదారులు ముందుకు వస్తారని, హాజరు శాతం కూడా పెరుగుతుందని సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్యలక్ష్మి పథకం కింద...

ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక్కో లబ్ధిదారుకు రూ.22.50 ఖర్చు చేసి ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. సెలవు రోజులు మినహా రోజూ సంపూర్ణ మధ్యాహ్న భోజనం పెట్టనున్నారు. అన్నం, పప్పు, కూరగాయలు, గుడ్డుతో భోజనంతో పాటు 200 మిల్లీలీటర్ల పాలు అందిస్తారు. గర్భిణులు, బాలింతలకు ఒక్కొక్కరికి 150 గ్రాములు, చిన్నారులకు 75 గ్రాముల చొప్పున బియ్యం వినియోగిస్తారు. 3 నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు కూడా అల్పాహారం, నెలకు 16 గుడ్లు అందించనున్నారు.

జిల్లాలో 926 కేంద్రాలు

జిల్లాలోని 926 అంగన్‌వాడీ కేంద్రాలలో 74,453 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో చిన్నారులు 62,013 మంది, గర్భిణులు 5,924 మంది, బాలింతలు 6,514 మంది ఉన్నారు. ప్రతి నెలా సరాసరి ఒక్కో కేంద్రానికి 55 నుంచి 60 కిలోల బియ్యం పంపిణీ జరుగుతున్నట్లు తెలుస్తోంది. దొడ్డు బియ్యం భోజనాన్ని చిన్నారులకు ఒక్కొక్కరికి 75 గ్రాములు, బాలింతలు, గర్భిణులకు 150 గ్రాముల చొప్పున వండి వడ్డిస్తున్నారు.

జిల్లా వివరాలు

మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు	816
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	110
జిల్లాలోని ప్రాజెక్టులు	4
వీటి పరిధిలోని సెక్టార్లు	37
ఐదేళ్లలోపు చిన్నారులు	62,013
గర్భిణులు	5,924
బాలింతలు	6,516

నేరుగా కేంద్రాలకు సరఫరా..



ఆరోగ్యలక్ష్మి పథకం కింద సన్నబియ్యంతో భోజనం వడ్డించేందుకు మార్గదర్శకాలు రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తాం. గోదాంల నుంచి సన్నబియ్యం నేరుగా కేంద్రాలకు సరఫరా అవుతాయి. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలి.

– నాగమణి, సీడీపీవో, నిర్మల్

నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి



మంత్రిని సన్మానిస్తున్న కాలనీవాసులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని చింతకుంట కాలనీలో కాలభైరవ ఆలయం, కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆదివారం కాలనీవాసులు మంత్రి ఐకేరెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి ఆలయానికి రూ.50 లక్షలు, కమ్యూనిటీ భవనానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మంత్రికి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, ఏవన్ కాంట్రాక్టర్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు అడప పోశెట్టి, రమణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో నోటి క్యాన్సర్‌కు ఆపరేషన్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని స్వప్న మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆదివారం అరుదైన ఆపరేషన్ నిర్వహించారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో మాత్రమే నిర్వహించే 'నోటి క్యాన్సర్' శస్త్ర చికిత్సను స్థానికంగా నిర్వహించినట్లు వైద్యుడు నాళం శశికాంత్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడకు చెందిన వ్యక్తి కొంతకాలంగా తంబాకు నమలడం వల్ల నోటి క్యాన్సర్ బారిన పడ్డాడు. చికిత్సకోసం ఆస్పత్రికిరాగా ప్రముఖ ఆంకాలజిస్ట్ సతీష్ పవార్‌తో కలిసి ఆదివారం ఆపరేషన్ నిర్వహించగా విజయవంతమైందన్నారు. ఇదే శస్త్రచికిత్సను నగరాల్లో నిర్వహిస్తే అధిక మొత్తంలో ఖర్చయ్యేదన్నారు. తక్కువ ఖర్చులో నాణ్యమైన శస్త్ర చికిత్సలు తమ ఆస్పత్రిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీతో పాటు ఉద్యోగులకు ఎంప్లాయ్ హెల్త్ స్కీం, పాత్రికేయులకు జర్నలిస్ట్ హెల్త్‌స్కీం అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లావాసులు స్థానికంగానే నాణ్యమైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

కడెం(ఖానాపూర్): పాడి రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని విజయ డెయిరీ జిల్లా మేనేజర్ దస్రునాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని పాత మద్దిపడగ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులకు రుణాలు, పాడి పశువుల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్, ఏపీఎం రాజారాం, కడెం డెయిరీ మేనేజర్ వెంకటస్వామి పాల్గొన్నారు.

కల్యాణం.. సామూహిక(త)ం

- గ్రామాల్లో సామూహిక వివాహాలు
- దాతల సహకారం..
- పేద కుటుంబాలకు తగ్గుతున్న భారం

సాక్షి మంచిర్యాల డెస్క్: 'ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు' అన్నారు పెద్దలు.. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ రెండూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు భారంగానే మారుతున్నాయి. పెళ్లి చేయాలంటే టెంటు సామగ్రి నుంచి మొదలుకుని ఫంక్షన్ హాల్, బ్యాండుమేళాలు, వీడియో, ఫొటోగ్రఫి, విందు భోజనాలతో ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. నేటి ఆధునిక కాలంలో ప్రీవెడ్డింగ్ షూట్‌లు అ'ధన'పు భారాలే అవుతున్నాయి. ఇక కట్నకానుకల సంగతి సరేసరి.. పేద కుటుంబాల్లో పెళ్లి భారం కాకూడదనే ఉద్దేశంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో ఏటా సామూహిక వివాహాలు జరిపిస్తున్నారు. కూతురు పెళ్లి చేయడానికి అప్పు పుట్టలేదని సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామ పంచాయతీ పరిధి ముత్తన్నపేటలో తండ్రి వేల్పుల అయిలయ్య ఈ నెల 20న ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సామూహిక వివాహాల ఆవశ్యకతను తెలియజేస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఏటా జరుగుతున్న సామూహిక వివాహాలపై ప్రత్యేక కథనం.

ఎన్ని పెళ్లిళ్లయినా ఖర్చు అంతే..

నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఝరి(బి) గ్రామంలో కరోనాకు ముందు సామూహిక వివాహాలు జరిపించేవారు. కోవిడ్ కారణంగా రెండేళ్లుగా నిర్వహించడం లేదు. అంతకుముందు తొమ్మిదేళ్లలో ఏటా పెళ్లిళ్లు జరిపిస్తూ 150 జంటలను ఏకం చేశారు. ఇదే మండలంలోని సింగన్‌గాం గ్రామంలో 20, బోరిగాంలో 20 జంటలకు నాలుగైదేళ్ల క్రితం వివాహం జరిపించారు. ఒక పెళ్లి జరిపించినా.. సామూహిక వివాహాలు జరిపించినా ఖర్చు అంతే వస్తుందని గ్రామస్తులు కలిసి సమష్టిగా నిర్ణయం తీసుకున్నారు. పెళ్లికొడుకు తరఫున రూ.30 వేలు, పెళ్లికూతురు తరఫున రూ.20 వేలు వసూలు చేసి భోజనాల ఖర్చుగా వెచ్చించేవారు.

- కుమురంభీం జిల్లా చింతలమానేపల్లి మండలం శివపెల్లి గ్రామంలో గతేడాది ఫిబ్రవరి 2న సామూహిక వివాహాలు జరిపించారు. శివాలయం వద్ద కొత్తపల్లి చంద్రయ్య, లక్ష్మి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ 101 ఆదివాసీ జంటలకు వివాహం జరిపించారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు, నాయకులు హాజరై కొత్త జంటలను ఆశీర్వదించారు. ప్రతీ జంటకు బట్టలు, పుస్తెమెట్టెలు, దేవుళ్ల చిత్రపటాలు, వంటసామగ్రి తదితర వస్తువులతో కిట్ కానుకగా అందజేశారు. కొత్తపల్లి శ్రీనివాస్ ఆదివాసీ గ్రామాల్లో పర్యటించిన సమయంలో ఆదివాసీ గిరిజనుల ఆర్థిక పరిస్థితులు చూసి చలించిపోయారు. పెళ్లిళ్లు చేయడానికి వారు పడుతున్న ఇబ్బందులు దృష్టికి రావడంతో 50 జంటలకు సామూహిక వివాహం జరిపించాలని నిర్ణయించారు. చాలామంది ఆసక్తి చూపడంతో నెల రోజుల్లోనే ఆ సంఖ్య కాస్త 101కి చేరింది. దీంతో రూ.20లక్షలు వెచ్చించి ఆలయంలో సామూహిక వివాహాలు జరిపించారు.
- ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం నర్సాపూర్ గ్రామంలో 38 ఏళ్ల క్రితం ప్రారంభమైన సామూహిక వివాహాల ఆచారం నేటికీ కొనసాగుతోంది. ఈ ఏడాది మే 4న నాలుగు జంటలకు ఒకే వేదికపై వివాహం జరిపించారు. పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ పిల్లల పెళ్లిళ్లు జరిపిస్తుంటారు. 38ఏళ్ల క్రితం కరువు ఏర్పడి రైతుల కుటుంబాలు వృథా ఖర్చులను అరికట్టేందుకు 1984లో సామూహిక వివాహాలు చేయడానికి నిర్ణయించారు. అప్పటి నుంచి ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. ఇప్పటివరకు ఈ వేదిక ద్వారా సుమారు 800 జంటలు ఒక్కటయ్యాయి.
- ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం దస్నాపూర్ గ్రామంలో ఆంద్ ఆదివాసీ కుల గురువు శ్రీసంత్ పూలాజీబాబా ప్రేరణతో పూలాజీబాబా ధ్యాన్ మందిర్ ఉత్సవ కమిటీ, ఆంద్ ఆదివాసీ సేవా సంఘం ఆధ్వర్యంలో గత 28 సంవత్సరాలుగా సామూహిక వివాహాలు జరిపిస్తున్నారు. ఏటా ఐదు నుంచి పది జంటలు ఏకమవుతున్నాయి. దస్నాపూర్‌గూడ, హర్కపూర్‌ఆంద్‌గూడ, అంజీ, మామిడిగూడ గ్రామాల్లో సామూహికంగా వివాహాలు జరిపిస్తున్నారు. ఈ ఏడాది మే 2 హర్కపూర్ ఆంద్‌గూడలో నిర్వహించిన వేడుకల్లో ఐదు జంటలు, దస్నాపూర్‌గూడలో మూడు, అంజీలో ఐదు జంటలు ఏకమయ్యాయి. ఖర్చులు తగ్గడంతోపాటు గ్రామాల మధ్య స్నేహభావం పెంపొందుతుందని ఆంద్ ఆదివాసీ పెద్దలు చెబుతున్నారు. తల్లిదండ్రులకు ఆర్థికంగా ఇబ్బందులు తగ్గించడానికి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఒక్కో జంట నుంచి రూ.20 వేల నుంచి రూ.25వేలు కమిటీ సభ్యులు సేకరిస్తారు.





ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి, కుమురంభీం జిల్లా చింతలమానేపల్లిలో జరిపిస్తున్న సామూహిక వివాహాలు(ఫైల్)

ఎమ్మెల్యే కోనప్ప కూతురి పెళ్లితో పాటే..

కుమురంభీం జిల్లా సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా సామూహిక వివాహాలు జరిపిస్తున్నారు. కోనప్ప తన కూతురు మధులిక వివాహం సమయంలో కాగజ్‌నగర్ పట్టణంలో 11జంటలకు వివాహం జరిపించి తండ్రి హృదయాన్ని చాటుకున్నారు.

- కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం క్రీడామైదానంలో 2014లో 113 జంటలకు పెళ్లి జరిపించారు.
- కౌటాల మండలం ప్రాణహిత సమీపంలో ఓ సంవత్సరం ఎనిమిది జంటలకు, మరో ఏడాది 16జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు.
- 2018లో బెజ్జూర్ మండలం సోమిని ప్రాణహిత వద్ద 103 జంటలకు వివాహాలు చేయించారు. 2021లో పెంచికల్‌పేట మండలం భద్రకాళి ఆలయంలో 126 జంటలకు వివాహాలు జరిపించారు.
- పెళ్లి సమయంలో నూతన జంటలకు మంగళ సూత్రాలు, పెళ్లిబట్టలు, బీరువా, తినుబండారాలు, వంట పాత్రలు అందజేస్తుంటారు. పెళ్లికి వచ్చిన బంధువులకు భోజనాలు ఏర్పాటు చేస్తుంటారు.

ఆర్థిక పరిస్థితులు చూసి చలించిపోయా



సిర్పూర్ నియోజకవర్గంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో పర్యటించిన సమయంలో ఆదివాసీ గిరిజనుల ఆర్థిక పరిస్థితులు చూసి చలించిపోయాను. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆదివాసీలు వివాహం చేసుకోలేని ఇబ్బందుల్లో ఉన్నారని అర్థమైంది. వారికి అండగా ఉండాలని సామూహిక వివాహాల నిర్ణయం తీసుకున్నా. స్థానిక ఆదివాసీ నాయకుల సహకారంతో అర్హులైన జంటలను గుర్తించి కొత్తపల్లి చంద్రయ్య, లక్ష్మి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు జరిపించా. ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించి కుట్టు మిషన్లు అందజేస్తున్నాం. కంటిపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి బెల్లంపల్లిలో కాటరాక్ట్ ఆపరేషన్లు చేయిస్తున్నాం. మరిన్ని సేవా కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– కొత్తపల్లి శ్రీనివాస్, బీజేపీ కుమురంభీం జిల్లా అధ్యక్షుడు

కూతురుకు కానుకగా వచ్చిన బంగారంతో పుస్తెలు చేయించి..



పెళ్లి బట్టలు అందిస్తున్న దేవర వినోద్

కుమురంభీం జిల్లా రెబ్బెన మండలం ఇంద్రానగర్‌కు చెందిన దేవర వినోద్ లాక్‌డౌన్ సమయంలో గ్రామాల్లో కొందరికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆ సమయంలో కొందరు ఆర్థిక ఇబ్బందుల కారణంగా పెళ్లి చేసుకోలేదనే విషయం ఆయన దృష్టికి వచ్చింది. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సామూహిక వివాహాలు జరిపిస్తుండడాన్ని స్ఫూర్తిగా తీసుకుని సామూహిక వివాహాలపై కుటుంబ సభ్యులు, తనకు తెలిసిన వారితో చర్చించాడు. సామూహిక వివాహాలు చేయించాలని నిర్ణయించుకున్నాడు. వినోద్ తన కూతురు 21వ రోజుకు కానుకగా వచ్చిన తులం బంగారంతో 11 మందికి పుస్తెలు చేయించాడు. పుస్తెలు చేసిన వ్యక్తి కొంత బంగారం కలిపాడు. మరికొందరు ఆర్థికంగా సహకరించారు. దీంతో 11 జంటలకు ఇంద్రానగర్ గ్రామంలోని కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి ఆలయంలో గతేడాది ఫిబ్రవరి 10న వివాహం జరిపించాడు. పెళ్లికి వచ్చిన బంధువులకు భోజనాలు ఏర్పాటు చేశాడు. కాగజ్‌నగర్‌కు చెందిన గజ్జెల శ్రీనివాస్, సురేష్ వంట పాత్రలు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి నూతన జంటలకు బిందెలు, ఎమ్మెల్యే ఆత్రం సక్కు బట్టలు అందజేశారు. రఫిక్ అనే వ్యక్తి పెళ్లి సమయంలో టెంట్ ఉచితంగా వేశాడు. మహంకాళి ఆలయ అర్చకుడిగా పని చేస్తున్న వినోద్ గ్రామంలో జరిగే పెళ్లిళ్లకు ఆలయం తరఫున పుస్తెమెట్టెలు అందించేలా సహకరిస్తున్నారు.

క్లుప్తంగా

గోదావరిలో మహిళ మృతదేహం లభ్యం



లభ్యమైన మహిళ మృతదేహం

భైంసా(ముధోల్): బాసర వద్ద గోదావరి నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఏఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం నదిలో ఆదివారం మహిళ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. మహిళ ఆకుపచ్చరంగు చీరతో ఉందని, 50ఏళ్ల ఉంటాయన్నారు. తెలిసిన వారు బాసర పోలీసులను సంప్రదించాలని కోరారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

భైంసాటౌన్: మద్యానికి బానిసగా మారిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన భైంసా పట్టణంలోని గణేశ్‌నగర్‌లో చోటుచేసుకుంది. గణేశ్‌నగర్‌కు చెందిన అండెల్‌వార్ సాయినాథ్(45) స్థానికంగా కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. మద్యానికి బానిస కావడంతో ఎవరూ పనికి పిలిచేవారు కాదు. దీంతో మనస్తాపం చెందిన సాయినాథ్ శనివారం రాత్రి భార్య, పిల్లలు కాలనీలోని ఓ శుభకార్యానికి వెళ్లగా ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఏరియాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు..



సాయినాథ్ (ఫైల్)

తానూరు(ముధోల్): మండలంలోని దాగాం గ్రామానికి చెందిన గొట్ట్కోళ్ల సాయినాథ్ (22) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం సాయినాథ్ ఏడాది నుంచి మద్యానికి బానిసై ఏ పని చేయకుండా తిరుగుతున్నాడు. కుటుంబ సభ్యులు పని చేసుకోవాలని మందలించడంతో మనస్తాపానికి గురైన సాయినాథ్ శనివారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే భైంసా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సాయినాథ్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య రుక్మాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడూర్‌లో దేశీదారు పట్టివేత

తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్ గ్రామంలో మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చి అక్రమంగా విక్రయిస్తున్న దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. భీంపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వడూర్ గ్రామంలో ఎస్సై రాధిక ఆదివారం సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. గ్రామానికి చెందిన గెడాం గోదుబాయి, అశోక్ అనే తల్లీకొడుకుల వద్ద 28 దేశీదారు సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అర్లి(టి) గ్రామంలో సాకిపెల్లి అనిల్, అమోల్‌ల వద్ద అక్రమంగా విక్రయిస్తున్న 81 దేశీదారు సీసాలను పట్టుకున్నారు. నిందితులు పారిపోగా బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైతు నెత్తిన ‘విత్తన’ భారం

- రూ.43 పెరిగిన పత్తి విత్తన ధరలు
- ఆందోళనలో అన్నదాత

నాలుగేళ్లుగా విత్తన ధరలు (ఒక ప్యాకెట్‌కు..)

సంవత్సరం	ధర
2020 –21	730
2021 –22	767
2022 –23	810
2023 –24	853



బోథ్: అసలే పెట్టుబడులు పెరిగి రైతులు ఆందోళన చెందుతుంటే పత్తి విత్తన ధరలు పెరిగాయి. ఒక్కో కాటన్ సీడ్ ప్యాకెట్‌పై రూ.43 చొప్పున రేటు పెరిగింది. రూ.810 ఉన్న ప్యాకెట్ ధర ప్రస్తుతం పెరిగిన ధరతో రూ. 853కు చేరింది. దీనికి సంబంధించి తాజాగా వ్యవసాయ శాఖ గెజిట్ విడుదల చేసింది. అధికారుల అంచనా ప్రకారం జిల్లాలో దాదాపు 4.10 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుంది. ఈ లెక్కన 8.20కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లు జిల్లాకు అవసరం. పెరిగిన ధరతో జిల్లా రైతులపై మొత్తం రూ.3.52 కోట్లకుపైగా అదనపు భారం పడనుంది.

పెరుగుతున్న పెట్టుబడులు

ప్రతీ ఏడాది పత్తి విత్తన ప్యాకెట్ల ధరలు పెరుగుతుండటంతో రైతులకు పెట్టుబడి ఖర్చు తడిసి మోపడవుతోంది. కార్పొరేట్ సీడ్ కంపెనీలు రైతుల నుంచి పత్తి విత్తనాలను సేకరించి, గ్రేడింగ్ చేసి జర్మినేషన్ చెక్ చేసి ప్యాకెట్ల రూపంలో అమ్ముతున్నాయి. రైతుల నుంచి సీడ్ కంపెనీలు కొన్న పత్తి విత్తనాలు, సీడ్ ప్యాకెట్ల రూపంలో తిరిగి రైతులకు చేరే సరికి భారీగా ధర పలుకుతున్నాయి. 2020–21 ఆర్థిక సంవత్సరంలో సగటున రూ.730గా ఉన్న పత్తి సీడ్ ప్యాకెట్ ధర, ప్రస్తుతం రూ.853కు చేరింది. నాలుగేళ్ల వ్యవధిలో రూ.123 మేర ధర పెరిగింది. ప్రతీ సంవత్సరం సగటున రూ.30 చొప్పున సీడ్ ప్యాకెట్ల ధరలు పెరిగాయి. ఎకరానికి దాదాపు 2 ప్యాకెట్ల వరకు అవసరం అవుతుండడంతో రైతుల ఖర్చులు బాగా పెరుగుతున్నాయి. ఏటా విత్తన ధరలు, క్రిమి సంహారక మందులు, యంత్రాల వినియోగ చార్జీలు, కూలీల ధరలు పెరగడంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది. దాదాపు ఎకరానికి రెండు ప్యాకెట్ల చొప్పున రైతులు కొనుగోలు చేస్తుంటారు. వర్షాలు పడకుంటే విత్తనాల ప్యాకెట్లు రెట్టింపు కొనుగోలు చేసే అవకాశం ఉంది. దీంతో రైతులపై అధికంగా భారం పడుతుంది. విత్తనాలపై సబ్సిడీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ధరల నియంత్రణపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

విత్తన ధరలు తగ్గించాలి



పత్తి విత్తన ధరలను తగ్గిస్తారనుకుంటే పెంచారు. ఇది రైతులకు భారంగా మారుతోంది. ఇప్పటికే పెట్టుబడులు పెరిగిపోయాయి. దీనికితోడు ప్రభుత్వం విత్తన ధరలు పెంచడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. విత్తన ధరలను వెంటనే తగ్గించాలి.

– ఇప్పు లక్ష్మణ్, బోథ్

కంపెనీలకు లాభం చేకూర్చేందుకే..



విత్తన కంపెనీలకు లాభం చేకూర్చేందుకే ఏటా ధరలు పెంచుతున్నారు. ప్రభుత్వం పెంచిన ధరలతో పాటు సబ్సిడీ కూడా పెంచాలి. అలా అయితేనే రైతులకు నష్టం జరగదు. పెట్టుబడులు ఇప్పటికే చాలా పెరిగిపోయాయి. ప్రభుత్వం మరోసారి ఆలోచించి పెంచిన ధరలను తగ్గించాలి.

– ఇదవు రాకేశ్, కనుగుట్ట

వన్‌టౌన్ ఎదుట యువకుడి హల్‌చల్



ఆత్మహత్యయత్నానికి పాల్పడిన యువకుడు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. తనను పోలీసులు అకారణంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఆత్మహత్యకు యత్నించడం తీవ్ర కలకలం రేపింది. విద్యానగర్ కాలనీకి చెందిన షిండే రోహిత్ అనే యువకుడు ఓ అమ్మాయిని వేధిస్తున్నాడనే కారణంతో వన్‌టౌన్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. బెయిల్‌పై బయటకు వచ్చిన యువకుడు ఆదివారం పురుగుల మందు డబ్బాతో స్టేషన్ వద్దకు వచ్చి తాగేందుకు యత్నించాడు. స్నేహితులు అడ్డుకుని అక్కడి నుంచి తీసుకెళ్లారు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ పెట్రోల్ బాటిల్‌తో స్టేషన్ వద్దకు వచ్చి ఒంటిపై పోసుకుని నిప్పంటించుకునేందుకు యత్నించాడు. దీన్ని గమనించిన పోలీసులు, స్నేహితులు అడ్డుకుని నీరు పోశారు. అనంతరం సదరు యువకుడిని స్నేహితులు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు తనపై అక్రమంగా కేసులు పెట్టి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని యువకుడు ఆరోపించాడు. ఈ విషయమై వన్‌టౌన్ సీఐ సత్యనారాయణను ‘సాక్షి’ సంప్రదించగా యువకుడిని రిమాండ్‌కు తరలించామని, బెయిల్‌పై బయటకు వచ్చాడన్నారు. యువకుడు తప్పు చేసినట్లు ఆధారాలు ఉన్నందునే కేసు నమోదు చేసి రిమాండ్ చేశామని తెలిపారు.

జన గణనలో ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మీడియం బాబురావు



సమావేశంలో మాట్లాడుతున్న మీడియం బాబురావు

ఎదులాపురం: జీవో నంబర్ 3ను వెంటనే పునరుద్ధరించాలని, జన గణనలో ఆదివాసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, భద్రాచలం మాజీ ఎంపీ మీడియం బాబురావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆదివాసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి వారిని ప్రత్యేక మతంగా గుర్తించాలన్నారు. దీంతో ఆదివాసీల సంస్కృతి పరిరక్షించడంతోపాటు సంక్షేమ ఫలాలు, అందుతాయన్నారు. సుప్రీంకోర్టు కొట్టేసిన జీవో నం.3ను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా పునరుద్ధరించాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా మరో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు పట్టాల విషయంలో స్పష్టమైన వైఖరి తీసుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్, దబ్బకట్ల లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి భైరి సోమేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కోట శ్రీనివాస్, అశోక్, ఆత్రం తనుష్, నాగేశ్వర్ రావ్, రాష్ట్ర నాయకులు కుంజా శ్రీను, మడకం సతీష్ పాల్గొన్నారు.

బాసరలో భక్తుల రద్దీ



భైంసా(ముధోల్): బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా వేకువజామునే గోదావరి నదిఘాట్‌లో పుణ్య స్నానం ఆచరించి గంగమ్మతల్లికి పూజలు చేశా రు. సూర్యేశ్వర స్వామి దర్శనం అనంతరం కాలి నడకన బాసర ఆలయానికి చేరుకుని క్యూలో వేచి ఉన్నారు. గంటపాటు నిరీక్షించి అమ్మవారిని దర్శించుకున్నారు. రూ.100, రూ. 1000 అక్షరా భ్యాస మండపాల్లో భక్తుల రద్దీ కనిపించింది. అనంతరం తమ చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేయించారు.

సమస్యలు గాలికొదిలేసిన ఎమ్మెల్సీలు

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్



మాట్లాడుతున్న సదానందం గౌడ్

నిర్మల్‌రూరల్: ఉపాధ్యాయ ఓట్లతో గెలిచిన ఎమ్మెల్సీలు ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను గాలికి వదిలేశారని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందంగౌడ్ ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎనిమిదేళ్లుగా పదోన్నతులు, ఐదేళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు తీవ్ర నిరాశ, నిస్పృహలో ఉన్నారన్నారు. పలుమార్లు అనేక రూపాల్లో ప్రభుత్వానికి మొర పెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేరన్నారు. బదిలీలు, పదోన్నతులపై హైకోర్టు విధించిన స్టే ఎత్తివేతకు ప్రభుత్వం త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది భర్తీకి టీఆర్టీ నోటిఫికేషన్ జారీ చేయాలని, పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జుట్టు గజేందర్, నాంపల్లి నాగభూషణ్, నాయకులు లక్ష్మీనర్సయ్య, గోవింద్ నాయక్, సిరాజొద్దీన్, శ్రీనివాస్, అన్సర్ అహ్మద్, పోతన్న, గంగాధర్ బోస్లే, ఇంతియాజ్ అహ్మద్, ముత్తన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సోయం కుమారుడి వివాహానికి ప్రముఖుల హాజరు



వధూవరులతో మంత్రి ఐకేరెడ్డి, ఎంపీ సోయం, ఎమ్మెల్యేలు



ఎంపీ సోయంతో బండి సంజయ్ ఆలింగనం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ కుమారుడు వెంకటేశ్ వివాహం ఆదివారం మావల మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించారు. వేడుకకు రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరయ్యారు. అలాగే ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపూరావ్, కోనేరు కోనప్ప, రేగ కాంతారావ్, మాజీ ఎంపీ నగేశ్, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు రాహుల్‌రాజ్, వరుణ్‌రెడ్డి హాజరయ్యారు.

సూపర్‌వైజర్‌పై కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

వేమనపల్లి: ముల్కలపేట, రాచర్ల గ్రామాల మధ్య వంతెన నిర్మిస్తున్న కాంట్రాక్టర్ చేస్తున్న విద్యుత్ చౌర్యంపై ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ఏఈ దీక్షిత్ ఆధ్వర్యంలో అధికారులు నిర్మాణంలో ఉన్న వంతెనను పరిశీలించారు. సూపర్‌వైజర్ ఏలేశ్వరం శ్రీనివాసచారిపై కేసు నమోదు చేశారు. అనంతరం ముల్కలపేట గ్రామం ట్యాంకు వద్ద ఐడిల్ లైన్‌కు తగిలించిన కొండీలను తొలగించారు. వంతెన నిర్మిత స్థలం వద్ద ప్రమాదకరంగా ఉన్న స్తంభం, విద్యుత్ లైన్ పక్కకు మార్చాలని కాంట్రాక్టర్‌కు నోటీసులు అందజేశారు. వరంగల్ ఎస్పీడీఎస్ రీజన్ పరిధిలోని ఉన్నతాధికారుల బృందం విచారణ చేపట్టనున్నట్లు ఏఈ పేర్కొన్నారు. కాంట్రాక్టర్‌పై కాకుండా సూపర్‌వైజర్‌పై మాత్రమే కేసు నమోదు చేయడం గమనార్హం.

గజ్జలమ్మ ఆలయంలో భక్తుల సందడి



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల(ముధోల్): కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. గజ్జలమ్మతో పాటు ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్, బోకర్, ధర్మాబాద్, శివుని, అప్పారావుపేట్, ఇస్లాపూర్ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి వచ్చారు. చిన్నారులకు తలనీలాలు, తులాభారం వేశారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకరణ, అభిషేకం, పల్లకీసేవ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మొక్కజొన్న దగ్ధం



కాలి బూడిదయిన కంకులు

కుంటాల(ముధోల్): కుంటాల శివారులోని ఆముదారి కృష్ణకు చెందిన మొక్కజొన్న కంకులు ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిబూడిదయ్యాయి. కృష్ణ తనకున్న నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. నూర్పిడి చేసేందుకు పంటను చేనులోనే ఉంచాడు. ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు పంటకు నిప్పంటుకుంది. దీంతో మొక్కజొన్న కంకులు కాలి బూడిదయ్యాయి. గ్రామపంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్ సాయంతో మంటలు ఆర్పి వేయడంతో మిగతా పంటకు ప్రమాదం జరగలేదు. రూ.2లక్షల వరకు నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు.



వనం వీడి జనావాసాల్లోకి వస్తున్న కోతులు ఇళ్లలో చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. వాటి చేష్టలతోనే మనల్ని భయపెడతాయి. కోతులకు భయపడి జనమే పారిపోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో అయితే కొన్నేళ్లుగా వానరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం కోతుల సమూహం మార్కెట్ ఏరియాలో దండయాత్రకు బయల్దేరింది. ఈ క్రమంలో ఓ కోతి మెడికల్ షాపులో చొరబడింది. సిబ్బంది దానిని వెళ్లగొట్టే క్రమంలో కోతి బయటకు వెళ్తుండగా ఒక్కసారిగా డోర్ వేయడంతో అది కోతికి తగిలింది. దీంతో అది అక్కడికక్కడే మృతిచెందింది. దీనిని గమనించిన మిగతా వానరాలు ఆగ్రహానికి గురయ్యాయి. సామూహికంగా మెడికల్ షాప్‌పై దాడికి యత్నించాయి. ఆందోళన చెందిన షాప్ యజమాని వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అక్కడికి చేరుకుని కోతులను అక్కడి నుంచి వెళ్లగొట్టారు. ఈ క్రమంలో అవి చనిపోయిన కోతిని తీసుకుని వెళ్లిపోయాయి.

– లక్సెట్టిపేట

అపురూపం.. ఆత్మీయ సమ్మేళనం



గురువులతో 1991 -1992 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

లక్ష్మణచాంద: మండలంలోని వద్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991 –92 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కనకాపూర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. 32 ఏళ్ల కిందట పాఠశాల చదువు ముగించుకుని వివిధ వృత్తులలో స్థిరపడిన 79 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంతో ఒక్కచోట చేరి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈసందర్భంగా అలనాటి గురువులను ఘనంగా సన్మానించారు.

సంతోషంగా ఉంది



32 సంవత్సరాల కిందట విద్యా బుద్ధులు నేర్పిన మమ్మల్ని గుర్తు పెట్టుకొని ఆత్మీయ సమ్మేళనం పేరిట ఆహ్వానించి సన్మానించడం చాలా సంతోషంగా ఉంది. మా విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండటం మరింత ఆనందంగా ఉంది.– ఆకుల లక్ష్మణ్, ఉపాధ్యాయుడు

ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చా



10వ తరగతి చదివిన మిత్రులు అందరూ ఆత్మీయ సమ్మేళనంలో కలుస్తున్నామని నన్ను కూడా రావాలని ఆహ్వానించారు. అలనాటి మిత్రులను కలవడం కోసం సెలవు పెట్టుకొని ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చాను.

– గుజారి ముత్యం, ఆర్మీ అధికారి, పూర్వ విద్యార్థి

పాత రోజులు గుర్తుకు వచ్చాయి



చాలా సంవత్సరాల కిందట చదివిన మిత్రులందరం కలిసి అప్పటి జ్ఞాపకాలను నెమరేసుకున్నాం. 32 ఏళ్ల తర్వాత ఒకరినొకరం ఆత్మీయంగా పలకరించుకున్నాం. మళ్లీ పాత రోజులు గుర్తుకు వచ్చాయి. – శ్రీనివాస్, పూర్వ విద్యార్థి